సాక్షి నిజామాబాద్

మంగళవారం ׀ 31 ׀ జనవరి ׀ 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి
ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు.
- 8లో ▸



రసవత్తరంగా ఎస్‌పీఎల్
నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.9 /19.0
పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. చలి తీవ్రత కొనసాగుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

సదరం క్యాంపులు ఖరారు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో ఫిబ్రవరి నెలలో నిర్వహించే సదరం క్యాంపుల తేదీలు ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 8, 15 తేదీల్లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద క్యాంపులు ఉంటాయన్నారు. ఇందుకు జిల్లాలోని దివ్యాంగులు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. కేటాయించిన తేదీల్లో రశీదుతో పాటు ఆధార్, మెడికల్ రిపోర్టులు వెంట తీసుకుని రావాలన్నారు. అలాగే మార్చిలో నిర్వహించే సదరం క్యాంపుల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.

పోక్సో కేసులో ప్రభుత్వ టీచర్ రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని బర్కత్‌పురలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని వేధింపులకు గురిచేసిన ప్రభుత్వ టీచర్ మునిపల్లి అరవింద్‌ను సోమవారం కోర్టులో హాజరు పర్చినట్లు రెండోటౌన్ ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపారు. టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. విచారణ చేసి చార్జీషీట్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

సస్పెన్షన్ వేటు

నిజామాబాద్ అర్బన్ : నగరంలోని బర్కత్‌పుర పాఠశాల ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటన తెలిపారు. పాఠశాలకు చెందిన బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంపై సోమవారం ఉపాధ్యాయుడిని అరెస్టు చేశారు. అనంతరం డీఈవో టీచర్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

9,397 మందికి కంటి పరీక్షలు

నిజామాబాద్ సిటీ: జిల్లా వ్యాప్తంగా సోమవారం కంటి వెలుగు పరీక్షలు 9,397 మందికి చేసినట్లు జిల్లా వైద్యశాఖాధికారి సుదర్శనం తెలిపారు. ఇందులో రీడింగ్ అద్దాలు 1,735 మందికి, దూరపు చూపు అద్దాలు 1,735 మందికి పంపిణీ చేయడం జరిగిందన్నారు.

3న తాళ్ల రాంపూర్ సొసైటీ ఆస్తుల వేలం

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): మోర్తాడ్ మండలం తాళ్ల రాంపూర్ సొసైటీకి సంబంధించి మిగిలిన ఆస్తులను ఫిబ్రవరి 3న అదనపు కలెక్టర్ చాంబర్‌లో వేలం వేయనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పలు ఆస్తులకు వేలం నిర్వహించగా వాటి కొనుగోలు పూర్తయిందన్నారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించే మిగతా బహిరంగ ఆస్తుల వేలం ప్రక్రియలో ఆసక్తి గల వ్యక్తులు పాల్గొని కొనుగోలు చేయవచ్చన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించుటకు షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 10 వరకు సాధారణ రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు.వివరాలకు 8008403518 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్: విద్యాశాఖలో బదిలీలకు సంబంధించిన దరఖాస్తు గడువును పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం ఏర్పాటు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో సోమవారం బదిలీలు, పదోన్నతులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి అప్పీల్ విచారణకు ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక కేంద్రంను ఏర్పాటు చేశారు. ఇందులో ఆరుగురు సభ్యులు ఉంటారు. వివరాలకు వారి నెంబర్లను సంప్రదించాలని డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

పేరు	హోదా	సెల్ నెంబర్
నాగజ్యోతి	ఏడీ	9908277450
శంకర్,	సూపరింటెండెంట్	9493021910
శివకుమార్	సీ.అసిస్టెంట్	9848217581
మహేందర్‌రెడ్డి	సీ.అసిస్టెంట్	9666322355
అసర్ జమన్	జూ.అసిస్టెంట్	7416363102
సుకేష్ కుమార్	జూ.అసిస్టెంట్	8074032001



మహాసభలో పీఠాధిపతులు, సాధువులు

సాధు సమ్మేళనం..

భక్తజన సందోహం

- పలుగుట్ట శ్రీ కేదారేశ్వరాశ్రమానికి పోటెత్తిన భక్తులు
- దేశంలోని ప్రసిద్ధ పీఠాధిపతులు హాజరు
- మంగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో సమ్మేళనం
- పాల్గొన్న పలువురు నేతలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నందిపేట పలుగుట్ట శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో అఖిలాంధ్ర సాధుసంతుల పరిషత్ మహాసభల నేపథ్యంలో భక్తజన సందోహం పోటెత్తింది. ఒకవైపు దేశంలోని వివిధ ప్రసిద్ధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు హాజరయ్యారు. మరోవైపు భక్తులు తండోపతండాలుగా వచ్చి సాధుసంతుల ప్రవచనాలు వింటున్నారు. అదేవిధంగా పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు పలుగుట్టను సందర్శించి సాధువుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ మహాసభల్లో భాగంగా సోమవారం హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి, మంగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో 1,331 కలశాలతో సహస్ర కలశాభిషేకం చేశారు. తర్వాత ఆలయ శిఖరంతో పాటు శివుడి విగ్రహానికి అభిషేకం చేశారు. ఇక తెల్లవారుజామున అయోధ్య నుంచి వచ్చిన 25 మంది సాధువులు ఆవు ఉత్పత్తులతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, భగవద్గీత పారాయణం చేశారు. ఇక వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులకు అల్పాహారం, అన్నదానం నిరంతరం కొనసాగాయి.



మాట్లాడుతున్న హంపీ పీఠాధిపతి

■ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇంత పెద్ద గొప్ప కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. ఇందులో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కేదారేశ్వర ఆశ్రమాన్ని అభివృద్ధి చేసేందుకు మరింత సహకరిస్తానన్నారు. ఇందులో కంటి ఆస్పత్రి నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామికి కవిత, జీవన్‌రెడ్డి సన్మానం చేశారు.

■ హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణే సాధు పరిషత్ ముఖ్య ఉద్దేశమన్నారు. హిందూ జీవన విధానం సూక్ష్మమైనదన్నారు. సుఖం, భోగం కోసం కాకుండా యోగం కోసం బతకాలన్నారు. సనాతన ధర్మాన్ని పునరుద్ధరించడం కోసం సామరస్యపూర్వక సమాజాన్ని నెలకొల్పాల్సి ఉందన్నారు. ప్రజలందరూ ధర్మమార్గంలో నడవాలన్నారు. ప్రాచీనమైన వేద విజ్ఞానం చాలా గొప్పదన్నారు. పంచేంద్రియాలు జయిస్తేనే ఆధ్యాత్మికత సిద్ధిస్తుందన్నారు.

■ సమ్మేళనానికి మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. ఇంత మంచి సమ్మేళనం ఇక్కడ నిర్వహించడం గొప్పవిషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో సమాజానికి మంచి శ్రేయస్సు కలుగుతుందన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సాధుసంతుల ప్రవచనాలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. దీంతో సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత



పాల్గొన్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తదితరులు



బీజేపీ నేత ఈటల రాజేందర్ తదితరులు

రాష్ట్రంలో అరాచక పాలన

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

పెర్కిట్ (ఆర్మూర్): సీఎం కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాలు, రాచరికపు పోకడల వల్ల తెలంగాణ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో సోమవారం నిర్వహించిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ సీఎం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రైతులు, పేదలు చివరకు ప్రజా ప్రతినిధులు ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. అభివృద్ధితో కాకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఇతర పార్టీల మధ్య చిచ్చులు పెడుతూ అధికారంలోకి రావడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పావులు కదుపుతున్నాడన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందకుండా చేస్తోందని విమర్శించారు. 2018 సంవత్సర ఎన్నికల సందర్భంగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తానన్న కేసీఆర్ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఏసీడీ పేరుతో రూ. వేలల్లో విద్యుత్ బిల్లులు వేస్తూ రాష్ట్ర ప్రజలపై భారం మోపుతున్నాడన్నారు. ప్రత్యేక రాష్ట్రంతో కష్టాలు తీరుతాయనుకున్న తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ చేసిందేమి లేదన్నారు. బంగారు తెలంగాణ బీజేపీ వల్లనే సాధ్యమవుతుందన్నారు.

కేసీఆర్ పాలనతో విసుగు చెందిన నాయకులు రానున్న రోజుల్లో బీజేపీలో భారీ స్థాయిలో చేరుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగా రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, వినయ్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహ రెడ్డి, సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, పోతంకర్ లక్ష్మీ నారాయణ, ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా, దినేష్ కులాచారి, జెస్సు అనిల్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

చిన్ని కృష్ణుడికి ‘అబ్దుల్ కలాం’ అవార్డు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో ఆదర్శ రైతుగా పేరొందిన జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు చెందిన చిన్ని కృష్ణుడు(నాగుల గంగారాం)కు అవార్డులు వస్తూనే ఉన్నాయి. ఇటీవల తన తల్లిదండ్రుల చిత్రాలను వ్యవసాయ క్షేత్రంలో వరి వంగడాలతో వేయడం ఆయనకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. ఇందుకు తమిళనాడులోని రామేశ్వరంలో ఉంటున్న అబ్దుల్ కలాం కుటుంబ సభ్యులు చిన్ని కృష్ణుడికి ‘అబ్దుల్ కలాం’ అవార్డును అందజేశారు. వివిధ రంగాల్లో ప్రతిభచూపిన వ్యక్తులకు ప్రతియేటా అబ్దుల్ కలాం అవార్డులను ఇస్తున్న కలాం కుటుంబ సభ్యులు ఈసారి జిల్లాకు చెందిన ఆదర్శ రైతు గంగారాంనకు అందజేశారు. అయితే, గంగారాం అంత దూరం వెళ్లలేకపోయినా కూడా పోస్టు ద్వారా ఇంటికి పంపించారు. ఇటీవల మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చిన్ని కృష్ణుడు

విద్యార్థులను సన్నద్ధం చేయాలి

- టెన్త్, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి
- కలెక్టర్ నారాయణరెడ్డి

సుభాష్‌నగర్: టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సమయం వృథా చేయకుండా విద్యార్థులు పరీక్షలకు సమాయత్తమయ్యేలా చూడాలన్నారు. తద్వారా మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని, జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈసారి వార్షిక పరీక్షల్లో పూర్తి స్థాయిలో సిలబస్ ఉన్నందున పునఃశ్చరణ తరగతులను పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ‘మన ఊరు – మన బడి’ కింద పనులు పూర్తయిన పాఠశాలల్లో ఫిబ్రవరి 1న ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కంటి వెలుగు శిబిరాలు ఎలా కొనసాగుతున్నాయని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, మండలస్థాయి అధికారులకు, వైద్య బృందాలకు మధ్య సమన్వయం పెంపొందేలా చూడాలన్నారు. హరితహారం నిర్వహణ మెరుగుపర్చాలని, రహదారులకు ఇరువైపులా, ఆయా కార్యాలయాలు, వివిధ ప్రదేశాల్లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాగా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి మార్చుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఉద్యోగికి సంబంధించి బయో–మెట్రిక్ హాజరు ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని, విధులపై నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించే వారిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్‌కు సూచించారు. జిల్లాలో ఆయిల్‌పాం పంట విస్తీర్ణం పెరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోవింద్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

‘పోడు’ పట్టాలు సిద్ధం చేయాలి

- కలెక్టర్లకు మంత్రులు, సీఎస్ దిశానిర్దేశం
- కంటి వెలుగు, మన ఊరు–మన బడి, ఆయిల్ పామ్ సాగుపై సమీక్ష
- పారదర్శకంగా టీచర్ల బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఆదేశం

సుభాష్‌నగర్: పోడు భూములకు సంబంధించిన తుది దశ ప్రక్రియలను తక్షణమే పూర్తి చేయాలని, ఫిబ్రవరి మొదటివారం నాటికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. సోమవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో పోడు భూములు, కంటి వెలుగు, మనఊరు – మనబడి, ఆయిల్‌పామ్ సాగు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. పోడు భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. అదేసమయంలో ఇకపై అటవీ ప్రాంతాల ఆక్రమణ, చెట్ల నరికివేతకు ఏమాత్రం ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పోడు భూములకు సంబంధించి ప్రతి క్లెయిమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టమైన ఆధారాలు పొందుపరుస్తూ క్లెయిమ్‌లను ఆమోదించాలని, నిబంధనలకు అనుగుణంగా లేకపోతే తిరస్కరించాలన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని నిశితంగా పర్యవేక్షణ చేయాలని, ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో పొరపాట్లకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరగాలన్నారు. మన ‘ఊరు–మన బడి’ కింద పనులన్నీ పూర్తయిన పాఠశాలలను ఫిబ్రవరి 1న ప్రారంభోత్సవాలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఈవిషయమై కలెక్టర్ నారాయణరెడ్డి స్పందిస్తూ జిల్లాలో ఆరు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటికే 2,316 ఎకరాల్లో పంట సాగు ప్రారంభమైందని, మరో 1,460 ఎకరాలకు సంబంధించి రైతులు ముందుకు వచ్చి డీడీలు చెల్లించారని సీఎస్ దృష్టికితెచ్చారు. ప్రస్తుతం ఎర్రజొన్న, మొక్కజొన్న పంటలు తుది దశలో ఉన్నాయని, కోతలు పూర్తికాగానే ఆయిల్‌పామ్‌కు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎఫ్‌వో వికాస్ మీనా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగూరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శన్, డీఈవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు

నందిపేట ప్రజలు క్షమించాలి

- అభివృద్ధి పనులు చేయలేక ముఖం చాటేస్తున్నాను
- ఎంబీలపై ఉపసర్పంచ్ సంతకాలు పెట్టడం లేదు
- కలెక్టరేట్‌లో సర్పంచ్ దంపతుల ఆత్మహత్యాయత్నం
- రూ. 2కోట్లకుపైనే బిల్లులు రావాల్సి ఉందని విలపించిన వైనం

సుభాష్‌నగర్ : ‘నాలుగేళ్లుగా సర్పంచ్‌గా కొనసాగుతున్నాను. బడుగు, బలహీనవర్గానికి చెందిన వాడిని. 20 ఏళ్లుగా సేవచేస్తూ సర్పంచ్‌గా గెలుపొందాను. అభివృద్ధి పనుల కోసం రూ. 2కోట్ల వరకు ఖర్చు చేశాను. చెక్కులపై ఉపసర్పంచ్ సంతకాలు పెట్టడంలేదు. బీఆర్‌ఎస్‌లో చేరితే బిల్లులు మంజూరవుతాయనే ఆశతో పార్టీ మారాను. వడ్డీ కలుపుకుని రూ. 4కోట్ల వరకు అప్పులయ్యాయి. పలుమార్లు కలెక్టర్, డీపీవో దృష్టికి తీసుకొచ్చాను.. నందిపేట్ ప్రజలు క్షమించాలి. బిల్లులు రాక అభివృద్ధి పనులు చేయలేక మొహం చాటేస్తున్నాను. సిగ్గుతో తలదించుకుంటున్నాను’ అని రోదిస్తూ నందిపేట సర్పంచ్ దంపతులు సాంబారు వాణి, తిరుపతి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు, జర్నలిస్టులు అగ్గిపెట్టె లాక్కున్నారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. కాగా పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టెతో కలెక్టరేట్‌లోకి రావడంతో భద్రతా సిబ్బంది కంగుతిన్నారు. కలెక్టర్ వచ్చే వరకూ కదిలేది లేదని భీష్మించారు. అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించిన పోలీసులతో వాదించారు. డీపీవో వచ్చి వారిని సముదాయించారు. సర్పంచ్ దంపతులపై ఆత్మహత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు.

అప్పుల పాలయ్యాం

బిల్లులు రాకపోవడంతో గ్రామంలో కొత్త అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నానని తిరుపతి వాపోయారు. అభివృద్ధి, సేవ చూసి విదేశాలు, అమెరికా నుంచి, ప్రముఖులు అవార్డులు అందజేశారని తెలిపారు. అప్పుల దిగులుతో తన భార్య వాణి ఆస్పత్రి పాలైందని, నేరుగా ఆస్పత్రి నుంచి ఇక్కడికి వచ్చామన్నారు. భార్యనే బతికించుకోలేని వాడిని, ఊరును ఏం ఉద్ధరిస్తానని విలపించాడు.

సర్పంచ్ వ్యవస్థను నాశనం చేశారు..

ఉప సర్పంచులకు చెక్‌పవర్ ఇచ్చి సర్పంచ్ వ్యవస్థను నాశనం చేశారని సర్పంచ్ భర్త తిరుపతి ఆరోపించారు. బీజేపీ మద్దతుతో సర్పంచ్‌గా గెలుపొందిన నాటి నుంచి అనేక వేధింపులు ఎదుర్కొన్నానని, అట్రాసిటీ కేసుతో మూడేళ్లపాటు బాధను అనుభవించానని రోదించారు. గ్రామ భూములు అమ్ముకున్నానని, పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశానని సస్పెండ్ చేస్తే.. కోర్టుకెళ్లి మళ్లీ తెచ్చుకున్నానని వివరించారు. వివిధ ఆరోపణలు చేస్తూ రెండున్నరేళ్ల పాటు చెక్‌పవర్ తొలగించారని, అయినా గ్రామాభివృద్ధికి నిధులు ఖర్చు చేశానని తెలిపారు. చివరకు పార్టీ మారినా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బిల్లులు, చెక్‌పవర్ ఇప్పించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మీకు తగునా.. కొన్ని సామాజికవర్గాలే కన్పిస్తున్నాయా.. బడుగు, బలహీన వర్గాలు కనిపించడం లేదా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం: డీపీవో

నందిపేట సర్పంచ్ సాంబారు వాణి, ఆమె భర్త తిరుపతి ప్రజావాణిలో ఉపసర్పంచ్‌పై ఫిర్యాదుచేశారని డీపీవో జయసుధ తెలిపారు. చెక్కులపై సంతకాలు చేయడం లేదని, గ్రామాభివృద్ధికి సహకరించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టి, పంచాయతీరాజ్ యాక్ట్–2018 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డీపీవో వారికి హామీనిచ్చారు. కాగా సర్పంచ్‌గా ఉండి ఉపసర్పంచ్ కాళ్లు మొక్కే పరిస్థితి ఎదురైందని, ఈ ఉపసర్పంచ్ వద్దని చెప్పినా విన్పించుకోలేదని వాపోయారు. ఒక డిజిటల్ టోకెన్(పెన్‌డ్రైవ్)తో సర్పంచ్‌గా పని చేయలేనని, తనకు వద్దని అధికారులకు ఇచ్చేశారు.



కలెక్టరేట్‌లో తమ గోడును వెల్లబోసుకుంటున్న నందిపేట సర్పంచ్ భర్త, ఆటోలో సర్పంచ్

క్లుప్తంగా

నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్‌లు చేయాలి




ఆర్మూర్‌: నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్‌లు నిర్వహించాలని జిల్లా రిజిస్ట్రార్‌ ఫణీందర్‌ సూచించారు. ఆర్మూర్‌ సబ్‌ రిజిస్ట్రేషన్‌ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్‌ నిర్వహిస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్మూర్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ అశీఫుద్దీన్‌కు పలు సూచనలిచ్చారు.

యూత్‌ పార్లమెంట్‌ విజేతల ప్రకటన

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌ లైన్‌ ద్వారా నిర్వహించిన జిల్లా స్థాయి యూత్‌పార్లమెంట్‌ పోటీల విజేతలను సోమవారం జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్‌ ప్రకటించారు. నిజామాబాద్‌ జిల్లాలో మొదటి స్థానంలో అక్షిత, రెండో స్థానంలో శ్రీజ జాదవ్‌, కామారెడ్డి జిల్లాలో మొదటి స్థానం మౌనిక, రెండో స్థానంలో రాగవర్శిని నిలిచారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కేశవ్‌ కుమార్‌, వినయ కుమార్‌, మోహన్‌ దాస్‌, హర్ష రాథోడ్‌, రవీందర్‌ రెడ్డి వ్యవహరించారు.

వాటర్‌ ట్యాంకు ఎక్కి నిరసన



బీబీపేట: బీబీపేట మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ అటెండర్‌ అరుణ్‌ జీతాలు పెంచాలని కోరుతూ సోమవారం వాటర్‌ ట్యాంక్‌ ఎక్కి నిరసన తెలిపాడు. తక్కువగా ఉండడంతో కుటుంబాల పరిస్థితి దీనంగా తయారైందని, ఉన్నతాధికారులు స్పందించి జీతాలు పెరిగేలా చూడాల ని డిమాండ్‌ చేశారు. అక్కడికి చేరుకున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్‌, ఎస్సై సాయికుమార్‌ అతనికి నచ్చ జెప్పి కిందికి దింపారు.

కోర్టులో కంటి వెలుగు ప్రారంభం



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో కంటివెలుగు కార్యక్రమాన్ని జిల్లా జడ్జి సునీత కుంచాల సోమవారం ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్నారు. కోర్టు పరిధిలోని సిబ్బంది, న్యాయవాదులు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సోమవారం 200 మంది సిబ్బంది, న్యాయవాదులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, సూపరింటెండెంట్‌ పురుషోత్తం గౌడ్‌ తదితరులు ఉన్నారు.

రేపు మన ఊరు–మన బడి పాఠశాలల ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమం ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలో 407 పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రస్తుతం 17 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. బుధవారం ఈ పాఠశాలలను ప్రారంభించనున్నారు.

టేకు కలప పట్టివేత

సిరికొండ: మండలంలోని తాటిపల్లి బీట్‌ అటవీ ప్రాంతంలో అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న టేకు కలపను పట్టుకున్నట్లు సిరికొండ సెక్షన్‌ అధికారి గంగారాం సోమవారం తెలిపారు. ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇరవై టేకు దుంగలను పోలీసుల సహకారంతో పట్టుకొని సీజ్‌ చేశామన్నారు. పట్టుకున్న టేకు కలప విలువ రూ.6599 ఉంటుందన్నారు. వెంకటస్వామి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

రసవత్తరంగా ఎస్‌పీఎల్‌

నేడు సెమీ ఫైనల్స్‌, ఫైనల్‌





బ్యాట్స్‌మన్‌ అవుట్‌ కావడంతో ఆనందంలో క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. టోర్నీలో భాగంగా సోమవారం క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌లు జరిగాయి. మంగళవారం సెమీ ఫైనల్‌, ఫైనల్‌ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్‌ మేనేజర్‌ పల్లె మహేష్‌, కోచ్‌ పారస్‌, అంపైర్లు షారుఖ్‌, దుర్గాప్రసాద్‌, స్కోరర్‌ నయూమ్‌, గ్రౌండ్స్‌మన్‌ కె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

8 వికెట్లతో గెలిచిన ‘సాందీపని’

జీజీ కళాశాల, సాందీపని డిగ్రీ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో సాందీపని జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్‌ చేసిన జీజీ కళాశాల పది ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 40 పరుగులు చేసింది. సాందీపని జట్టు 6.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

గెలుపొందిన గౌతమి కళాశాల

రెండో మ్యాచ్‌ వీఆర్‌సీ, గౌతమి కళాశాల మధ్య జరిగింది.వీఆర్‌సీ పది ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 60 పరుగులు చేయగా గౌతమి కళాశాల జట్టు 9.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది.

భారీ విజయం అందుకున్న క్షత్రియ

మూడో మ్యాచ్‌లో క్షత్రియ కాలేజీ, కామారెడ్డి ఎస్‌ఆర్‌కే జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకున్న క్షత్రియ జట్టు 10 ఓవర్లలో 116 పరుగులు చేసింది. ఇందులో సచిన్‌ 25 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఆర్‌కే జట్టు నిర్ణీత ఓవర్లలో 71 పరుగులు మాత్రమే చేసింది. క్షత్రియ బౌలర్‌ సచిన్‌ మూడు వికెట్లు తీసుకున్నాడు.

‘నిశిత’ భారీ స్కోర్‌

నాలుగో మ్యాచ్‌లో నిశిత కాలేజీ, వీఆర్‌ఈసీ మధ్య జరిగింది. ఇందులో టాస్‌ గెలిచిన నిశిత జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. చరణ్‌ 72 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వీఆర్‌ఈసీ 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది. అభిజిత్‌ 45 రన్స్‌తో రాణించిన ఫలితం లేకుండా పోయింది.

నేడు సెమీస్‌

సీనియర్‌ విభాగంలో సాందీపని, గౌతమి కళాశాల మధ్య మొదటి సెమీ ఫైనల్‌ జరగనుంది. రెండో మ్యాచ్‌ క్షత్రియ కాలేజీ, నిశిత కళాశాల మధ్య ఉంటుంది. జూనియర్‌ విభాగంలో ఫైనల్‌ మ్యాచ్‌ నిజామాబాద్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల, ఎస్‌ఆర్‌ కళాశాలల మధ్య ఉంటుంది.

సెమీస్‌లో రాణిస్తా



నేను చేసిన 72 పరుగులు జట్టు విజయానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇదే స్ఫూర్తితో సెమీస్‌లో రాణించి మా జట్టును విజేతగా నిలుపుతాను.

– చరణ్‌, నిశిత కళాశాల

అధికార పార్టీ తొత్తులుగా పోలీసులు



జిల్లా కోర్టులో మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌ అలీ తదితరులు

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌ సిటీ: పోలీసులు అధికార పార్టీ నాయకుల తొత్తులుగా మారి కాంగ్రెస్‌ నాయకులను అరెస్టులు చేయటం సరికాదని పీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్‌ గడుగు రోహిత్‌ను అరెస్టు చేసి సారంగపూర్‌ జైలుకు పంపగా, సోమవారం రోహిత్‌ను సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ విప్‌ అనిల్‌ కుమార్‌, జిల్లా కాంగ్రెస్‌ నాయకులు పరామర్శించారు. కార్పొరేటర్‌ గడుగు రోహిత్‌ మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయటం మంచిదికాదన్నారు. వెంటనే రోహిత్‌ను విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్‌ నాయకులు అనుకుంటే టీఆర్‌ఎస్‌ వాళ్లు రోడ్లపై తిరిగేవారు కాదన్నారు. కేసీఆర్‌, కేటీఆర్‌లను రోడ్లపై కొడుతు జైల్లో పెట్టె సమయం ఆసన్నమైందని, అక్రమ అరెస్టులకు కాంగ్రెస్‌ నాయకులు ఎవరు భయపడవద్దన్నారు. త్వరలోనే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో మాట్లాడి జైల్‌ బరో కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. మాజీ విప్‌ ఈరవత్రి అనిల్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ నాయకులపై అక్రమంగా కేసులు పెడితే చూస్తు ఊరుకోమన్నారు. నిజామాబాద్‌ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి, కామారెడ్డి అధ్యక్షుడు కైలాష్‌ శ్రీనివాస్‌, కేశ వేణు, తాహెర్‌ బిన్‌ హందాన్‌, గడుగు గంగాధర్‌, నగేష్‌రెడ్డి ఉన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి పదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: పదేళ్ల బాలిక చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించిన సూత్రాల ఆనంద్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తు నిజామాబాద్‌ పోక్సో కోర్టు (అదనపు జిల్లా సెషన్స్‌ కోర్టు) న్యాయమూర్తి శ్రీనివాసరావు సోమవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్‌ ప్రాసికూటర్‌ రవిరాజ్‌ తెలిపిన వివరాలు... నిర్మల్‌ జిల్లా కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన ఒక కుటుంబం బతుకు దెరువు కోసం మోర్తాడ్‌ మండలంలోని ఒక గ్రామంలో స్థిర పడింది. 2022 జనవరి 6న తల్లిదండ్రులు కూలీ పనికి పోయిన తర్వాత అదే గ్రామానికి చెందిన ఆనంద్‌ పదేళ్ల బాలికకు డబ్బులు ఇస్తానని చేయి పట్టుకుని ప్రైవేట్‌ పార్ట్స్‌ తాకాడనే అభియోగాలు నేర న్యాయ విచారణలో రుజువయ్యాయి. దీంతో సెక్షన్‌ 354 ప్రకారం ఐదేళ్లు, పోక్సో చట్ట ప్రకారం అదనంగా మరో ఐదేళ్లు జైలుశిక్ష తో పాటు రూ.5 వేల జరిమాన విధించారు. జరిమానా చెల్లించక పోతే మరో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు పీపీ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని శ్రీనగర్‌ కాలనీకి చెందిన కులకర్ణి కల్యాణి(32) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదో టౌన్‌ ఠాణా ఎస్సై సందీప్‌ తెలిపారు. వివరాలు.. కాలనీకి చెందిన దిలీప్‌తో 2018లో కల్యాణికి వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కల్యాణి ప్రైవేట్‌ బ్యాంకులో స్వీపర్‌గా పని చేస్తుంది. ఈ మధ్య ఆమె ఆర్థిక పరిస్థితి బాగ లేదని బాధ పడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అసద్‌ బాబానగర్‌లో ఒకరి హత్య

ఖలీల్‌వాడి: నగరంలోని అసద్‌బాబానగర్‌లో ఆదివారం రాత్రి ఒకరు హత్యకు గురయ్యారు. అసద్‌ బాబానగర్‌లోని రాజీవ్‌ గృహకల్పలో నివాసం ఉంటున్న అహ్మద్‌ ఖాన్‌ (52)ని అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న పాషా కత్తితో పొడవడంతో చనిపోయాడు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న డ్రెయినేజీ పాడవడంతో దానిని అహ్మద్‌ ఖాన్‌, మునీర్‌ మరమ్మతు చేయిస్తున్నారు. ఆ సమయంలో వీరిద్దరితో పాషా గొడవకు దిగారు. దీంతో పాషాను అహ్మద్‌ ఖాన్‌ కొట్టాడు. పాషా స్థానికంగా ఉండే తన స్నేహితుడైన అక్తర్‌ను రప్పించాడు. అనంతరం పాషా తన ఇంట్లో నుంచి కత్తిని తీసుకొచ్చి అహ్మద్‌ ఖాన్‌ను పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అహ్మద్‌ఖాన్‌ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

సెప్టిక్‌ ట్యాంక్‌లో పడి మృతి!

ఖలీల్‌వాడి: నగరంలోని కోజా కాలనీలో సెప్టిక్‌ ట్యాంక్‌ క్లినింగ్‌ చేయడానికి వచ్చి అందులో పడి ఒకరు మృతి చెందినట్లు తెలిసింది. నగరంలోని నెహ్రూనగర్‌ వద్ద ఉన్న అడ్డా నుంచి కూలీని ఇంటి ఓనర్‌ తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. అయన సెప్టిక్‌ ట్యాంక్‌ వద్ద పని చేస్తున్న సమయంలో ఫిట్స్‌ వచ్చి పడిపోయినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబును వివరణ కోరగా అడ్డా కూలీ సెప్టిక్‌ ట్యాంక్‌ క్లీన్‌ చేయడానికి వెళ్లి, అక్కడ ఫిట్స్‌ రావడంతో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి వివరాల కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

లెక్చరర్‌పై కేసు నమోదు

సదాశివనగర్‌: సదాశివనగర్‌లోని మోడల్‌ కళాశాలలో (పీజీటీ)బోటని లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేశ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌ సోమవారం తెలిపారు. నరేశ్‌ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థి సంఘాలు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్‌ ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

మద్యం తాగించి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



నీరడి శ్రీనివాస్‌(ఫైల్‌)

నస్రుల్లాబాద్‌: మండలంలోని అంకోల్‌ తండా శివారులో అంకోల్‌ గ్రామానికి చెందిన నీరడి శ్రీనివాస్‌(40) దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మద్యం తాగిన తర్వాత సీసాను నోట్లో దూర్చి పగులకొట్టి చంపారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శ్రీనివాస్‌ ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన మరో ఇద్దరితో మద్యం తాగినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం క్లూస్‌ టీం ఆధారాలను సేకరించింది. డాగ్‌ స్క్వాడ్‌ అనుమానితుల్లో ఒకరి ఇంటికి వెళ్లి ఆగింది. శ్రీనివాస్‌కు భార్య సావిత్రి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు.

వివాహేతర సంబంధమే కారణమా!

మృతుడి సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌ భార్య సావిత్రికి తన ఇంటిక పక్కనే ఉన్న మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. దీంతో శ్రీనివాస్‌ సదరు వ్యక్తితో తరుచు గొడవ పడేవాడు. నెల రోజుల క్రితం భార్య కూడా శ్రీనివాస్‌తో గొడవ పడి తల్లిగారింటికి పిల్లలతో వెళ్లింది. దీంతో వివాహేతర సంబంధమే హత్యకు కారణం అయి ఉంటుందని గ్రామస్తులు అనుకుంటున్నారు. అనుమానితులు గతంలో శ్రీనివాస్‌కు డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. డబ్బుల విషయంలో గొడవ జరిగి చంపేశారా తెలియాల్సి ఉంది. అలాగే శ్రీనివాస్‌కు పలువురితో గ్రామంలో వ్యవసాయ భూమి విషయంలో గొడవలు ఉన్నట్లు సమాచారం. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

బెయిల్‌ మంజూరు

మోపాల్‌: మంచిప్ప ముంపు నిర్వాసితుల కమిటీ సభ్యులపై నమోదైన హత్యాయత్నం కేసులో రిమాండ్‌ అయిన శ్రీనివాస్‌యాదవ్‌, శంకర్‌కు సోమవారం బెయిల్‌ మంజూరు అయింది. గడ్కోల్‌ పంప్‌హౌస్‌ పనులు అడ్డుకునే క్రమంలో పోలీసులు, అధికారులు, నిర్వాసితుల మధ్య గత మేలో తోపులాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధికారుల ఫిర్యాదు మేరకు 15 మందిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఈ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇద్దరికి బెయిల్‌ మంజూరు కాగా కేసులో ఉన్న మిగతా వారికి నేడు, రేపు ముందస్తు బెయిల్‌ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. బెయిల్‌ మంజూరు అయిన వారు మంగళవారం విడుదల కానున్నట్లు సమాచారం.

ఒకరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కామారెడ్డి క్రైం: ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్‌ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రామారెడ్డికి చెందిన అసాద్‌ అలీ కామారెడ్డిలోని అశోక్‌నగర్‌ కాలనీలో చికెన్‌ సెంటర్‌ నడిపిస్తుంటాడు. ఆదివారం రాత్రి ఆయన జయశంకర్‌ కాలనీ వద్ద బైక్‌పై వెళ్తుండగా మరో బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడి చేసినట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి అతడిని ఆస్పత్రికి తరలించారు. సోషల్‌ మీడియాలో ఈ ఘటనలో అసద్‌అలీపై కత్తిపోట్ల దాడి జరిగినట్లుగా ప్రచారం జరిగింది. అసద్‌ అలీ కడుపు భాగంలో ఓ చిన్న గాయం ఉందని పోలీసులు తెలిపారు. కానీ కత్తిపోట్ల దాడి కాదన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చినట్లు అసద్‌అలీ ఫిర్యాదు చేశాడని పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెండింగ్‌ ఫిర్యాదులు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ నారాయణరెడ్డి, అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 90 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, జెడ్పీ సీఈవో గోవింద్‌, డీపీవో జయసుధ వినతులు స్వీకరించారు.

బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలి

రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి 5శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌ రుణాలు, వివాహ ప్రోత్సాహకం, పరికరాలు ఇవ్వాలని ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. ఈమేరకు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని రాములు మాట్లాడుతూ రెండేళ్లుగా రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని, స్వయం ఉపాధి కోసం నిరుద్యోగ వికలాంగులు దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. వికలాంగులకు డబుల్‌ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని, పింఛన్‌ రూ.10వేలకు పెంచాలని డిమాండ్‌చేశారు. ఆసరా పింఛన్ల మంజూరుకు ఆదాయ పరిమితి విధించే జీవోనెంబర్‌ 17ను రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు జైరాం, ఎల్లయ్య, సంగీత, లక్ష్మి, మల్లేష్‌, సోని, సంజీవ్‌ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

నగర శివారులోని బోర్గాం(పి)లోగల నిజాంసాగర్‌ కెనాల్‌ కట్ట (డీ57)పై 20 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని ఉన్న కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కమలాపురం రాజన్న మాట్లాడుతూ 20 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, విద్యుత్‌ కనెక్షన్‌ పొంది బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నారని తెలిపారు. ఇళ్లపట్టాల కోసం దరఖాస్తు పెట్టుకోగా 76 మందికి ఇచ్చారని, మరో 13 మందికి ఇవ్వాలని కోరారు.

టీయూ హ్యాండ్‌బాల్‌ జట్ల ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్‌ ఆరతి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్శిటీ క్యాంపస్‌ గ్రౌండ్‌లో సోమవారం హ్యాండ్‌బాల్‌ మహిళల, పురుషుల జట్ల ఎంపికలను నిర్వహించినట్లు వర్సిటీ డైరెక్టర్‌ స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ డాక్టర్‌ సంపత్‌ తెలిపారు. వివిధ కళాశాలల నుంచి పురుషుల విభాగంలో 35 మంది, మహిళల విభాగంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన పురుషుల జట్టు ఫిబ్రవరి 4 నుండి 8 వరకు తమిళనాడులోని సేలంలో జరిగే సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటుంది. మహిళ జట్టు ఫిబ్రవరి 15 నుండి 19 వరకు కేరళలోని కొట్టయమ్‌ మహాత్మాగాంధీ యూనివర్శిటీలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటుంది. ప్రిన్సిపాల్‌ ఆరతి, ఫిజికల్‌ డైరెక్టర్‌ బాలమణి, స్వప్న, వర్షిని, వరలక్ష్మి, సౌమ్య, వర్శిటీ క్రీడావిభాగం సహాయ ఆచార్యులు డా.బి.ఆర్‌.నేత పాల్గొన్నారు.

సాధు సమ్మేళనం.. భక్తజన సందోహం



పాల్గొన్న భక్తులు

నందిపేట పలుగుట్ట శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో అఖిలాంధ్ర సాధుసంతుల పరిషత్‌ కొనసాగుతోంది. సోమవారం పూజలు, యాగాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



హోమం చేస్తున్న సాధువులు



ఆశ్రమ ఆవరణలో భక్తులు

విడాకుల పంచాయితీలో యువకుడి కిడ్నాప్‌



సతీష్‌

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌ గ్రామానికి చెందిన గొల్ల గుర్జకింది సతీష్‌ అనే యువకుడు సిరికొండ అటవీ ప్రాంతంలో కిడ్నాప్‌కు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. గడ్కోల్‌కు చెందిన మల్లయ్య పెద్ద కుమారుడు సంజీవ్‌కు భీంగల్‌కు చెందిన దొడొల్ల మల్లేష్‌ పెద్ద కూతురుతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య జరిగిన గొడవలతో కొన్ని నెలలుగా సంజీవ్‌ భార్య తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. విడాకుల పంచాయితీ నడుస్తున్నట్లు తెలిసింది. సంజీవ్‌ తమ్ముడు సతీష్‌ తన తండ్రితో కలిసి వేములవాడ వద్ద ఎనుగంటి గ్రామంలో గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. సంజీవ్‌ సోమవారం గొర్రెల వద్దకు వెళ్లగా సతీష్‌ గడ్కోల్‌ గ్రామానికి చెందిన కొండూర్‌ సాయన్న అనే వ్యక్తితో ద్విచక్రవాహనంపై ఎనుగంటి నుంచి గడ్కోల్‌కు వస్తున్నాడు. మార్గమధ్యలో సిరికొండ అటవీ ప్రాంతంలో మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వీరిని చుట్టుముట్టారు. సతీష్‌ను, సాయన్నను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి వాదనకు దిగారు. సంజీవ్‌ మామ మల్లేష్‌ మరో ఐదుగురితో కలిసి సతీష్‌పై దాడికి దిగినట్లు సా యన్న తెలిపాడు. రెండు గంటల అనంతరం సాయన్నను అక్కడే వదిలేసి సతీష్‌ను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లిపోయారు. తన కూతురుకు విడాకులు ఇచ్చి త్వరగా పంచాయితీ మాట్లాడుకుంటేనే సతీష్‌ను విడిచిపెడతామని వారు చెప్పారని సాయన్న తెలిపారు. కిడ్నాప్‌ చేసిన వారు సతీష్‌తో కుటుంబ సభ్యులకు ఫోన్‌ చేయించారు. పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేయవద్దని గతంలో విడాకుల పంచాయితీలో మాట్లాడిన విధంగా జరిమానా చెల్లిస్తే సతీష్‌ను వదిలేస్తామని చెప్పించారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. సతీష్‌ భార్య రుచిత ఫిర్యాదు మేరకు మల్లేష్‌తో పాటు మరో ఐదుగురిపై కిడ్నాప్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సీఐ సైదా, ఎస్సై సిబ్బందితో కలిసి సతీష్‌ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కాగా నిందితుడి ఇంటికి తాళం ఉందని, ఫోన్‌ కూడా స్విచ్‌ ఆఫ్‌ వస్తోందని పోలీసులు తెలిపారు. నిందితుడి భార్య, కూతురు వారి బంధువుల ఇంట్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి, విచారిస్తున్నట్లు తెలిసింది.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన నగదు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో షార్ట్‌ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధం అయింది. వివరాలు.. గ్రామానికి చెందిన పెద్ది నారాయణ, ఆయన భార్య గంగు సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు నారాయణకు సమాచారం అందించారు. ఇంటి తాళం పగుల గొట్టి లోనికి వెళ్లి మంటలను ఆర్పడానికి యత్నించారు. పెంకుటిళ్లు కావడంతో దూలాలకు నిప్పు అంటుకొని ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. ట్రంకు పెట్టెలో దాచుకున్న రూ.2.50 లక్షల నగదు కాలిపోయింది. ఇంట్లోని సామగ్రి, నిత్యావసర వస్తువులు బట్టలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. పదేళ్లుగా కాయకష్టం చేసుకొని సంపాదించి దాచుకున్న లక్షల రూపాయలు కాలిపోయాయని బాధితులు రోధించారు. ఉప సర్పంచ్‌ ఏనుగు రాజేశ్వర్‌ రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి పంచనామా చేశారు. రూ.ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

కుక్కల దాడిలో 33 గొర్రెలు మృతి

రామారెడ్డి: రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామంలో ఆదివారం రాత్రి కుక్కల దాడిలో 33 గొర్రెలు మృతి చెందాయి. మూడు గొర్రెలు గాయపడ్డాయి. సుమారు రూ.మూడు లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు బొల్లారపు నడిపి మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలాన్ని ఎంపీటీసీ రాజాగౌడ్‌, టీఆర్‌ఎస్‌ నాయకుడు ప్రభాకర్‌రావు సందర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

